క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



రామమందిరం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో రామమందిరం నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. గతంలోని రామాలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని ఎర్రచెరువు వద్ద వినాయక ఆలయ పునర్నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. బాబా గుడి వెనకభాగంలోని పాత వినాయక మందిరం స్థానంలో కొత్త నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసు



అవగాహన కల్పిస్తున్న రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జైభీమ్

వంగర: సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. మండలంలోని సంగాం గ్రామంలో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలు, సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా నమోదు చేసే కేసులు, విధించే శిక్షలను గురువారం వివరించారు. గతంలో సారా తయారు చేసిన వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల వెంకటనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



తాము గీసిన బొమ్మలు చూపిస్తున్న విద్యార్థులు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు గురువారం నిర్వహించారు. మొత్తం 20 విద్యార్థులు ఈ పోటీలకు హాజరై, చక్కని చిత్రాలు గీసి తమలోని ప్రతిభను కనబరిచారు. అత్యుత్తమ చిత్రాలు వేసిన వారికి విజ్ఞాన శిబిరాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటల ప్రయోజనాలు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రకృతి సేద్యం ట్రైనీ మాస్టర్ కిరణ్‌కుమార్, ఐసీఆర్‌పీలు రమణ, తవిటినాయుడులు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయల విక్రయాలు గురువారం చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటలు కావాలంటే ప్రతిరైతు ప్రకృతి సేద్యం వైపు మరలాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, కలశాలలతో ఉత్సవ విగ్రహ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, రేజేటి వంశీ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని చీపురుపల్లి, బొబ్బిలి రోడ్లలోని ప్రాంతాలకు ఈ నెల 2వ తేదీన విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థంభాల మార్పు చేస్తున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

శ్రమజీవుల స్వేదమే.. దేశానికి నిజమైన సంపద



తెర్లాంలో ఎనిమిది గంటల పనిదినాన్ని కాపాడుకుందామని పిలుపునిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు



బాడంగిలో జరిగిన కార్యక్రమంలో కార్మికలోకం వర్ధిల్లాలని నినాదాలు చేస్తున్న కార్మికులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు



బొబ్బిలి: కార్మికశక్తికి జోహార్లు చెబుతున్న అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సాంబయ్య తదితరులు

వాడవాడలా మేడే ఘనంగా నిర్వహించారు. 19వ శతాబ్దంలో కార్మికులు ఎదుర్కొన్న తీవ్రమైన పరిస్థితులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల జ్ఞాపకార్థంగా ఏటా ఈ కార్యక్రమం జరుపుకుంటారు. వాడవాడలా గురువారం జరిగిన ఈ అంతర్జాతీయ కార్మిక దినోత్సవంలో ఎనిమిది గంటల పనిని సాధించడానికి కార్మిక కర్షకులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. శ్రమజీవుల స్వేదమే దేశానికి నిజమైన సంపద అని, అలాంటి వారి శ్రమను గుర్తిద్దాం..గౌరవిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం పలువురు కార్మికులను సన్మానించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురంలో మేడే వర్ధిల్లాలని నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు



రాజాం సిటీ: రాజాంలో కార్మికశక్తి పోరాటానికి గుర్తుగా ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



సంతకవిటి: కార్మిక కర్షకులకు జోహార్లు చెబుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



రేగిడి: సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద మేడే వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు



బొబ్బిలి: కార్మికుల హక్కుల కాపాడాలని సీఐటీయూ నాయకుల నినాదాలు



బొబ్బిలి: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే



వంగరలో మేడేలో సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

రూ.కోటి నష్టపరిహారం అందివ్వాలి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: సింహాచలం పుణ్యక్షేత్రంలో గోడ కూలిన ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందివ్వాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని పక్కి గ్రామంలోని ఆయన స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. టీడీపీ హయాంలోనే భక్తులు ప్రాణాలు అధికంగా పోతున్నాయన్నారు. గతంలో గోదావరి పుష్కరాలు, మొన్న తిరుపతిలో తొక్కిసలాట, ఇప్పుడు సింహాచలం అప్పన్నస్వామి సన్నిధిలో భక్తులు ప్రమాదానికి గురై, మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యం వల్లే అమాయకులైన భక్తులు, ప్రజల ప్రాణాలు బలవుతున్నాయన్నారు.

కూటమి ప్రభుత్వ పాపాలై భక్తుల పాలిట యమపాశాలవుతున్నాయని మండిపడ్డారు. నిత్యం భక్తుల వచ్చే ప్రముఖ ఆలయాల్లో పనులకు యాష్ ఇటుకలతో నిర్మాణాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆ నిర్మాణాలు తాత్కాలికమా లేక శాశ్వతమా తేల్చాలని, శాశ్వత నిర్మాణాలైతే ఇటువంటి నిర్మాణాలే చేస్తారా అని నిలదీశారు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగినా కూటమి ప్రభుత్వం తన తప్పును ఒప్పుకోకుండా ఆ తప్పును వేరే వాళ్లమీదికి నెట్టివేసే ధోరణికి దిగుతుండడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత వహించి, బాధిత కుటుంబాలకు సంపూర్ణ న్యాయం చేయాలని కోరారు.

బాడంగి సీహెచ్‌సీకి రోగుల తాకిడి



ఇన్‌పేషెంట్లతో కిక్కిరిసిన వార్డు

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)కి రోగుల తాకిడి ఎక్కువైంది. ఓపీ రోగులతో పాటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మలేరియా, డయేరియా తదితర ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో ఉండాల్సిన వారికి ఇన్‌పేషెంట్ వార్డు చాలకపోవడంతో ఆస్పత్రి వరండాలోనే వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే గురువారం కేవలం డెర్మటాలజిస్ట్, గైనకాలజిస్టులు మాత్రమే ఉండి రోగులకు సేవలందించారు. 50 పడకల ఆస్పత్రిగా మార్చినా సరిపడ గదులు, బెడ్లు, వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి వరండాలోనే కొంతమందికి చికిత్స అందించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఆస్పత్రి నూతన భవనం అందుబాటులోకి తీసుకురావాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్‌తీగలు



గొర్లెసీతారాంపురం జాతీయ రహదారిపై పడిన విద్యుత్ తీగలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం అంతర్‌రాష్ట్ర రహదారిపై విద్యుత్ తీగలు గురువారం తెగిపడ్డాయి. అటువైపుగా వెళ్తున్న పాదచారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది విద్యుత్ తీగలను తీసేసి, వాటి స్థానంలో కొత్త వాటిని పునరుద్ధరించారు. అయితే విద్యుత్ తీగలు రోడ్డుపై పడిన సమయంలో ఎవరూ ఆ రోడ్డులో వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి, మరమ్మతులకు గురైన స్తంభాలు, వైర్లు గుర్తించి, మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

రేగిడి: డ్వాక్రా గ్రూపు మహిళలంతా బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. మండలంలోని వావిలవలస, చినలింగాలవలస, పెదలింగాలవలస, వావిలవలస, తోకలవలస గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు మహిళలతో గురువారం సమావేశమైన ఆయన..రుణ బకాయిలు చెల్లించే సమయంలో సభ్యులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ప్రారంభించారు. మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ఇస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.

వర్షంతో ఉపశమనం

బాడంగి: మండలంలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చల్లని వాతావరణం నెలకొంది. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ప్రస్తుతం వానలతో నెలకొన్న చల్లదనంతో ఉపశమనం పొందుతున్నారు. కొన్నిచోట్ల వీచిన భారీ ఈదురుగాలులకు విద్యుత్‌తీగలపై చెట్లకొమ్మలు విరిగిపడి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం మండలంలో కురిసిన వర్షం 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో రజని తెలిపారు.

బొప్పడాం జంక్షన్‌లో చోరీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో ఉన్న టీ టైమ్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై బాధితుడు దన్నాన బంగార్రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంక్షన్‌లో ఉన్న టీ టైంలో ఐస్ క్రీమ్ ఫ్రిజ్‌తో సహా, గ్యాస్ సిలిండర్, స్టవ్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యాన్‌లో వచ్చి మరీ చోరీకి పాల్పడ్డారని చెప్పారు. దొంగతనంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రాలు



పెంట గ్రామంలోని చెత్త సంపద కేంద్రం వద్ద పరిసరాలు శుభ్రం చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: మండలంలోని పలు చెత్త సంపద కేంద్రాలను ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ల్లో చెత్త నుంచి సంపద తయారు కావడం లేదన్న నేపథ్యంతో చెత్త నుంచి సంపద ఉత్తిదే.. శీర్షికన సాక్షి దినపత్రికలో ఇటీవల వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి, వినియోగంలోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించి, వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఎంపీడీవో రవికుమార్ నేతృత్వంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, ఎనర్జీ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులంతా యుద్ధ ప్రాతిపదికన చెత్త సంపద కేంద్రాల వద్ద చెత్తాచెదారం ఏరివేయించి, తక్షణమే వినియోగంలోకి వచ్చేలా గ్రీన్‌అంబాసిడర్లకు ఆదేశాలు ఇచ్చారు. పెంట, దిబ్బగుడ్డివలస గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల వద్ద పారిశుధ్య సిబ్బందితో పరిసరాల పరిశుభ్రతా చర్యలు చేయించి, వాటిని వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఉపాధి పనుల పరిశీలన



రాజాం సిటీ: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని ఆగూరులో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లతో పాటు పనులు జరుగుతున్న తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే రోజుకు రూ.307లు వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. వేతనదారులు పనికి వచ్చినప్పుడు తమ వెంట పనిముట్లు తీసుకురావాలన్నారు.



రేగిడి: కాగితాపల్లిలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి, పారంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో శ్యామలాకుమారి, ఆమదాలవలస, అప్పాపురం గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏపీవో ఎస్.హరనాథరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా చల్లని సమయాల్లో పనులు చేసుకోవాలని, నీడ కోసం పని ప్రదేశంలో టెంట్లు ఉంచుకోవాలని, తక్షణ శక్తి కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని వేతనదారులకు తెలిపారు.

కోతల్లో ఇదో రకమా..!

- మరమ్మతుల పేరిట తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేత
- అవస్థలు పడుతున్న ప్రజలు



సతివాడ సబ్‌స్టేషన్

నెల్లిమర్ల రూరల్: 'నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం' ఈ ప్రకటనలు గడిచిన ఎనిమిది నెలల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నిత్య కృత్యంలా మారాయి. సరఫరా నిలిపివేస్తున్నామంటూ అధికారులే ముందస్తు ప్రకటనలు ఇస్తున్నారు. ప్రజలు ఇబ్బందుల పడకూడదని ముందుగానే అప్రమత్తం చేయడం మంచిదే అయినప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యం ఇదే ప్రక్రియను విద్యుత్ అధికారులు అవలంభిస్తుండడంతో విసిగిపోతున్నామంటూ ప్రజలు చెబుతున్నారు. కోతల్లో భాగంగా ఇదో రకమైన విధానం కాబోలంటూ వినియోగదారులే విమర్శించడం గమనర్హం. సమస్య ఏదైనా.. విద్యుత్ సరఫరా నిలుపుదలతో ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అసలే వేసవి కావడంతో వారి వెతలు మరింత రెట్టింపు అవుతున్నాయనేది వాస్తవం.

మరమ్మతుల పేరిట కోతలు

నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరిట తరుచూ కోతలు విధిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో పాటు వివిధ కారణాలతో తరుచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా కొన్ని గ్రామాల్లో లోడు సరిపోక అంతరాయం ఏర్పడుతుండంతో ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సరఫరా నిలుపుదలతో సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయక పాలనపరమైన సమస్యతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

పైడిభీమవరం నుంచి రెండు సబ్‌స్టేషన్లకు

రణస్థలం మండలం పైడిభీమవరం 33 కేవీ లైన్ నుంచి నెల్లిమర్ల మండలంలోని సతివాడ, రామతీర్థం సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో తరుచూ లోఓల్టేజ్ సమస్య ఏర్పడుతుంది. పైడి భీమవరం లైన్‌లో ఏదైనా సమస్య ఏర్పడుతున్నప్పుడు మండలంలోని సుమారు 30 గ్రామాల వరకు లో ఓల్టేజ్ వస్తోంది. దీంతో విద్యుత్ అధికారులు గరివిడి నుంచి ఆ రెండు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. పారసాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, తదితర గ్రామాల్లో విద్యుత్ అధికారులు ఇటీవల లోడుకు తగ్గ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాలకు సమస్య తప్పింది.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

వినియోగదారుల ఇళ్లకు, వ్యవసాయ క్షేత్రాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో పలు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల ప్రక్రియను కొనసాగిస్తున్నాం. చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను సైతం పరిష్కరిస్తున్నాం. లోఓల్టేజ్ సమస్యలు ఉన్న గ్రామాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోడును కూడా పెంచుతున్నాం. అనధికార కోతలు లేవు. ప్రజలు సహకరిస్తే అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయగలం. గ్రామాల్లో సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

–పిచ్చయ్య, విద్యుత్ ఏఈ, నెల్లిమర్ల